క్లుప్తంగా

భక్తిశ్రద్ధలతో సుబ్రహ్మణ్య షష్ఠి



బాలేరులో పూజలు చేస్తున్న స్వాములు

భామిని: మండలంలోని బాలేరు, పక్కుడుభద్ర, బొమ్మిక, సింగిడి, బత్తిలి తదితర గ్రామాల్లో సోమవారం సుబ్రహ్మణ్య షష్ఠి పూజలు ఘనంగా నిర్వహించారు. భక్తులు పెద్ద సంఖ్యలో తరలివచ్చి సుబ్రహ్మణ్య స్వామికి అభిషేకాలు, విశేష పూజలు చేశారు. అవివాహితులు, వివిధ సమస్యలతో సతమతమౌతున్న వారు సుబ్రహ్మణ్య స్వామిని పూజిస్తే సమస్యలు తీరడంతో పాటు కోరిన కోర్కెలు నెరవేరుతాయని భక్తుల విశ్వాసం.

సమగ్రశిక్ష ఉద్యోగులకు ఆర్థిక సాయం



సమగ్రశిక్ష ఉద్యోగులకు ఆర్థిక సాయం అందిస్తున్న ఎంఈఓలు

జియ్యమ్మవలస: మండల విద్యాశాఖ కార్యాలయంలో పనిచేస్తున్న సమగ్రశిక్ష ఉద్యోగులకు మండలంలోని ఉపాధ్యాయులు ఆర్థిక సాయం అందించారు. సీఆర్పీలు, ఎల్‌డీఏ, ఆఫీస్ సబార్డినేట్‌లకు సుమారు 4 నెలలుగా జీతాలు లేకపోవడంతో వారంతా కుటుంబ పోషణకు ఇబ్బందులు పడుతున్నారని భావించి ఉపాధ్యాయులంతా తలో కొంత చొప్పున రూ.70 వేలు సేకరించారు. ఈ మొత్తాన్ని ఎంఈఓలు నాగభూషణరావు, శ్రీనివాసరావు చేతులమీదుగా సోమవారం ఉద్యోగులకు అందజేశారు. కార్యక్రమంలో ఉపాధ్యాయ సంఘ నాయకులు ఉన్నారు.

ఎయిడ్స్‌పై అవగాహన

భామిని: మండలంలోని బిల్లుమడ సచివాలయంలో ఎయిడ్స్, హెచ్ఐవీలపై సోమవారం అవగాహన కార్యక్రమం నిర్వహించారు. వైఎస్సార్‌సీపీ నాయకుడు బూస సంతోష్‌కుమార్ అధ్యక్షతన నిర్వహించిన ఈ సమావేశంలో బత్తిలి పీహెచ్‌సీ వైద్య సిబ్బంది హెచ్ఐవీ వ్యాప్తి, నివారణ చర్యలను వివరించారు. చైల్డ్ ఫండ్ ఇండియా సారథ్యంలోని లింక్ వర్కర్స్ స్కీమ్ కింద ఈ కార్యక్రమం నిర్వహించినట్లు చెప్పారు. ఎస్‌ఓ సీహెచ్ ప్రసాద్, సీఎల్‌డబ్ల్యూ శ్రీను, ఏఎన్ఎం స్రవంతి పాల్గొన్నారు.

సౌండ్ సిస్టం వితరణ



సౌండ్ సిస్టంను అందిస్తున్న ఉపాధ్యాయిని జయమణి

పాలకొండ: పట్టణంలోని ఇందిరానగర్ కాలనీ ప్రభుత్వ పాఠశాలకు అదే పాఠశాలలో పని చేస్తున్న ఉపాధ్యాయిని జె.జయమణి రూ.20 వేలు విలువచేసే సౌండ్ సిస్టం సోమవారం వితరణ చేశారు. పాఠశాల అభివృద్ధికి జయమణి చేసిన సేవా కార్యక్రమాలను హెచ్ఎం రామలక్ష్మి కొనియాడారు. ఆమెను ఆదర్శంగా తీసుకుని ఉపాధ్యాయులు పాఠశాలల అభివృద్ధికి ముందుకు రావాలని కోరారు.

ఎమ్మెల్సీ మృతికి సంతాపం



ఎమ్మెల్సీ షేక్ సాబ్జీ చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న యూటీఎఫ్ నాయకులు

భామిని: ఉభయ గోదావరి జిల్లాల ఉపాధ్యాయ ఎమ్మెల్సీ షేక్ సాబ్జీ మృతికి పార్వతీపురం మన్యం జిల్లా యూటీఎఫ్ జిల్లా శాఖ సోమవారం సంతాపం ప్రకటించింది. ఇటీవల రోడ్డు ప్రమాదంలో మృతి చెందిన ఎమ్మెల్సీ షేక్ సాబ్జీ చిత్రపటానికి భామిని మండల కేంద్రంలో సంతాప సభ నిర్వహించి నివాళులర్పించారు. యూటీఎఫ్ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు ఇ.తిరుపతిరావు, కె.ప్రసాద్, కోశాధికారి బి.మహేష్, మండల నాయకులు పాల్గొన్నారు.

కవులకు సత్కారం

గుమ్మలక్ష్మీపురం: తాడేపల్లిలో ఈనెల 16, 17 తేదీల్లో జరిగిన ప్రపంచ కవితోత్సవంలో ఏజెన్సీ కవులైన ఎల్విన్‌పేట ప్రాథమిక పాఠశాల హెచ్ఎం పెద్దింటి నిర్మల్ కుమార్, మండ గ్రామంలోని ఎంపీపీ పాఠశాల హెచ్ఎం పాలక దేవానంద్‌లకు శ్రీశ్రీ కళావేదిక అంతర్జాతీయ చైర్మన్ కత్తిమండ ప్రతాప్, సమన్వయకర్త కొల్లి రమావతి తదితరులు మెమొంటో, ధ్రువపత్రాలు అందించి సన్మానించారు. ఈ సందర్భంగా నిర్మల్‌కుమార్, దేవానంద్ సోమవారం గుమ్మలక్ష్మీపురంలో స్థానిక విలేకర్లతో మాట్లాడుతూ ప్రపంచ కవితోత్సవంలో త్రినేత్రం అనే కవితను రచించి చదివి వినిపించడం జరిగిందని, ఆలోచింపజేసే కవితలు రాయడం, జీవం ఉట్టిపడేలా దాన్ని ప్రజెంట్ చేయడంతో వేదిక ప్రతినిధులు తమను సత్కరించినట్లు చెప్పారు.

జగనన్నను ఆశీర్వదించండి



కొమరాడ: పూడేస్ సచివాలయం వద్ద వైఎస్సార్‌సీపీ జెండా ఎగరవేస్తున్న పార్టీ కన్వీనర్ జనార్దనరావు, నాయకులు



సీతంపేట: కొండాడలో 'వై ఏపీ నీడ్స్ జగన్' కార్యక్రమంలో పాల్గొన్న ఎంపీపీ ఆదినారాయణ, తదితరులు



గుమ్మలక్ష్మీపురం: నెల్లికిక్కువలో వైఎస్సార్‌సీపీ జెండాను ఆవిష్కరిస్తున్న ఎంపీపీ కె.దీనమయ్య



పాలకొండ రూరల్: దోలమడలో పార్టీ జెండా ఎగురవేస్తున్న వైఎస్సార్‌సీపీ నాయకులు

పాలకొండ రూరల్: సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పాలనలో మీకు, మీ కుటుంబానికి మంచి జరిగిందని అనిపిస్తే.. వచ్చే ఎన్నికల్లో జగనన్నను మరోసారి ఆశీర్వదించాలని వైస్ ఎంపీపీలు కనపాక సూర్యప్రకాష్, వాకముడి అనీల్‌కుమార్ అన్నారు. మండలంలోని డోలమడ గిరిజన గ్రామంలో సర్పంచ్ బిడ్డిక వెంకయ్య నేతృత్వంలో 'వై ఏపీ నీడ్స్ జగన్' కార్యక్రమాన్ని సోమవారం నిర్వహించారు. ముందుగా గ్రామంలో వైఎస్సార్‌సీపీ జెండాను ఎగురవేశారు. అనంతరం ఇంటింటికీ వెళ్లి ప్రభుత్వ సంక్షేమ పథకాలు, అభివృద్ధిపై అవగాహన కల్పించారు. రాష్ట్రానికి మళ్లీ జగనే ఎందుకు కావాలో వివరించారు. అనంతరం గ్రామ సచివాలయం వద్ద సంక్షేమ పథకాల డాష్‌బోర్డును ఆవిష్కరించారు. కార్యక్రమంలో ఎంపీటీసీ పాండ్రంకి హైమావతి, రణస్థలం రాంబాబు, నల్లి శివప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

సీతంపేట: మండలంలోని కొండాడ సచివాలయం పరిధిలో ఎంపీపీ బి.ఆదినారాయణ ఆధ్వర్యంలో సోమవారం 'వై ఏపీ నీడ్స్ జగన్' కార్యక్రమాన్ని నిర్వహించారు. పార్టీ కార్యకర్తలు, అభిమానులు, సర్పంచ్‌లు, ఎంపీటీసీలు పాల్గొన్నారు.

కొమరాడ: మండలంలో గిరిశిఖరం గ్రామమైన పూడేస్ సచివాలయం వద్ద వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ ద్వారపురెడ్డి జనార్దనరావు ఆధ్వర్యంలో 'వై ఏపీ నీడ్స్ జగన్' కార్యక్రమాన్ని సోమవారం నిర్వహించారు. ఈ సందర్భంగా జనార్దనరావు మాట్లాడుతూ.. ప్రజలకు ఇచ్చిన హామీలను శతశాతం నెరవేర్చిన ఏకైక ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అన్నారు. సంక్షేమ పాలన కొనసాగాలంటే మళ్లీ జగనే సీఎం కావాలని, అందుకు ప్రజలంతా వైఎస్సార్‌సీపీకి మద్దతివ్వాలని కోరారు. అనంతరం సచివాలయ వద్ద సంక్షేమ పథకాల డ్యాష్‌బోర్డు అవిష్కరించారు. కార్యక్రమంలో పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

ప్రజా సంక్షేమమే ప్రభుత్వ ధ్యేయం

- నిండుమనసుతో జగనన్నను ఆశీర్వదించాలి
- ఎమ్మెల్యే విశ్వాసరాయి కళావతి

పాలకొండ రూరల్:



నవగాంలో ప్రజలకు ప్రభుత్వ సంక్షేమ పాలనను వివరిస్తున్న ఎమ్మెల్యే కళావతి

ప్రజా సంక్షేమమే ధ్యేయంగా జగనన్న ప్రభుత్వం గడిచిన నాలుగున్నరేళ్లగా అడుగులు ముందుకు వేస్తుందని రాష్ట్ర శాసనసభ ఆర్థిక వ్యవహారాల అంచనాల కమిటీ చైర్‌పర్సన్, పాల కొండ ఎమ్మెల్యే విశ్వాసరాయి కళావతి అన్నారు. సోమవారం నవగాం, అవలంగి గ్రామాల సంయుక్త సచివాలయ పరిధిలో సర్పంచ్ తొర్లపాటి నీరజతో కలిసి 'గడప గడపకు మన ప్రభుత్వం' కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఇంటింటికీ వెళ్లి ప్రజల యోగక్షేమాలపై ఆరాతీశారు. జగన న్న ప్రభుత్వం అర్హతే ప్రామాణికంగా ఆయా కుటుంబాలకు అందించిన సంక్షేమ లబ్ధిని విపులంగా వివరిస్తూ, ఇందుకు సంబంధించిన బ్రోచర్లు లబ్ధి దారులకు అందించారు. గతంలో ఏ ప్రభుత్వం చేయని విధంగా ప్రజా సంక్షేమం, అభివృద్ధి, ఆరో గ్య రక్షణ చర్యలు చేసి చూపిస్తున్న సీఎం వైఎస్ జగన్ అన్నారు. నాడు-నేడు, జీజీఎంపీ, జలజీవన్ మిషన్ ద్వారా గ్రామాల్లో జరుగుతున్న అభివృద్ధిని ప్రజలు గుర్తించాలన్నారు. రానున్న ఎన్నికల్లో వైఎస్సార్‌సీపీకి ప్రజలు అండగా నిలవాలని, నిండు మనసుతో ఆశీర్వదించాలని కోరారు. ప్రస్తుత సీజన్‌లో రైతులకు అండగా ఉండాలని అధికారులకు సూచించారు. అక్కడి ప్రజల సలహాలు, ఫిర్యాదులను సానుకూలంగా స్వీకరించారు. వాటి పరిష్కారానికి కృషి చేస్తామన్నారు. కార్యక్రమంలో వైస్ ఎంపీపీలు కనపాక సూర్యప్రకాష్, వాకముడి అనీల్‌కుమార్, మండల వ్యవసాయ సలహా మండలి అధ్యక్షులు రణస్థలం రాంబాబు, ఏఎంసీ వైస్ చైర్మన్ పొట్నూరు లక్ష్మణరావు, బీసీ కార్పొరేషన్ రాష్ట్ర డైరెక్టర్ నల్లి శివప్రసాద్, పొట్లి సర్పంచు గొర్ల క్రిష్ణారావు, పార్టీ నాయకులు లావేటి శ్యామ్ సుందరరావు, కోట కృష్ణమూర్తి నాయుడు, వన్నల సరసయ్య, కోట పార్వతి, రమేష్, త్రినాధరావు, పలుశాఖల అధికారులు పాల్గొన్నారు.

ఎస్‌పీ మంజూరుకు ఎమ్మెల్యే కృషి అభినందనీయం



బాలేరు వద్ద ఎస్‌పీ నిర్మాణ పనులను పరిశీలిస్తున్న విశ్రాంత వీసీ సుదర్శనదొర, రొక్కం రామారావు

భామిని: మండలంలోని బాలేరు సమీపంలో వంశధార వరదకాలువ నుంచి సాగునీరు తరలించేందుకు వరదకాలువపై డ్రోణి నిర్మాణానికి ఎమ్మెల్యే విశ్వాసరాయి కళావతి చేసిన కృషిని నాగార్జున యూనివర్సిటీ విశ్రాంత వైస్ ఛాన్సలర్ రొక్కం సుదర్శన దొర, నీటి సంఘ మాజీ అధ్యక్షుడు రొక్కం రామారావు కొనియాడారు. బాలేరు వద్ద వంశధార వరదకాలువపై నీటి తరలింపు డ్రోణి నిర్మాణ స్థలంను సోమవారం పరిశీలించారు. గత ఏడేళ్లుగా బాలేరు గెడ్డ సిస్టమ్ నీరును సాగుభూమి చెరువులకు తరలించాలని కోరుతూ ఆయకట్టు రైతులు పోరాడుతున్నారు. వరద కాలువ నిర్మాణంతో గెడ్డ సిస్టమ్ నీరు కొండ అంచుల్లోనే నిలిచిపోయి వందలాది ఎకరాల పంటకు నష్టం కలుగుతున్నాయని వాపోయారు. ఇటీవల కురుపాంలో ముఖ్యమంత్రి జగన్‌ను ఎమ్మెల్యే కళావతితో కలిసి ఆయకట్టు రైతుల కలిసి నీటి సమస్య వివరించగా సహృదయంతో స్పందించి నీటి తరలింపు డ్రోణి(ఎస్‌పీ)నిర్మాణంకు ఆదేశాలు ఇచ్చారు. అనంతరం వంశధార ప్రాజెక్ట్ అధికారులు నిర్మాణ పనులు చేపట్టేందుకు చర్యలు తీసుకుంటున్నారు. వారి వెంట వైఎస్సార్‌సీపీ నాయకులు మేడిబోయిన చలపతి, బోడాల చిన్నయ్యదొర, రైతులున్నారు.

గిరిజన స్పందనకు 17 వినతులు



వినతులు స్వీకరిస్తున్న ఈఈ సింహాచలం

సీతంపేట: ఐటీడీఏలో సోమవారం జరిగిన గిరిజన స్పందనకు 17 వినతులు వచ్చాయి. ట్రైబల్ వెల్ఫేర్ ఇంజినీరింగ్ ఈఈ సింహాచలం గిరిజనుల నుంచి వినతులు స్వీకరించారు. భూమి పట్టా మంజూరు చేయాలని బర్న సీతంపేటకు చెందిన కుమార్, కుట్టుమిషన్ ఇప్పించాలని మానాపురానికి చెందిన రేఖ వినతి ఇచ్చారు. రహదారి మరమ్మతులు చేపట్టాలని డెప్పవలస గిరిజనులు కోరారు. టిటుకుపాయిగూడ గ్రామస్తులు కమ్యూనిటీహాల్ నిర్మించాలని కోరారు. రామన్నగూడలో నాటుకోళ్ల ఫారం ఏర్పాటు చేయడానికి రుణం ఇప్పించాలని మల్లేషు, అంగన్‌వాడీ భవనం నిర్మించాలని దిగువనేలబొంతుకు చెందిన కె.భారతి, సీసీ రోడ్డు మంజూరు బెన్నడుగూడ గ్రామస్తులు వినతులు అందజేశారు. కార్యక్రమంలో వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

సచివాలయాల ద్వారా ఇంటి ముంగిటకే పాలన

- ఎమ్మెల్యే విశ్వాసరాయి కళావతి



నూతన సచివాలయ భవనాన్ని ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే కళావతి

వీరఘట్టం: గ్రామ సచివాలయాల ద్వారా ఇంటి ముంగిటికే పాలన అందిస్తున్న ఏకైక ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అని ఎమ్మెల్యే విశ్వసరాయి కళావతి అన్నారు. వండువ గ్రామంలో రూ.40 లక్షల వ్యయంతో నూతనంగా నిర్మించిన సచివాలయ భవనాన్ని సోమవారం ఎమ్మెల్యే ప్రారంభించి సచివాలయ సేవలను పూర్తిస్థాయిలో ప్రజలకు అందుబాటులోకి తీసుకువచ్చారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. దేశంలో ఇప్పటికి వరకు ఎక్కడా లేని విధంగా ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం గ్రామ, వార్డు సచివాలయ వ్యవస్థను తెచ్చిందన్నారు. పాలనలో అవినీతికి, వివక్షతకు తావు లేకుండా ప్రజలకు సుపరిపాలన అందివ్వాలనే ప్రధాన ఉద్దేశంతో ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి సచివాలయ వ్యవస్థకు శ్రీకారం చుట్టారన్నారు. గ్రామ, వార్డు సచివాలయాల్లో దాదాపు 35 ప్రభుత్వ శాఖలకు సంబంధించి సుమారు 650 సేవలు అందుబాటులో ఉన్నాయని పింఛన్ కావాలన్నా, రేషన్ కార్డు కావాలన్నా, ఇంటి పట్టాలు కావాలన్నా.. ఇలా ఏ సేవలు కావాలన్నా గ్రామ సచివాలయాల్లో అర్జీ పెట్టుకున్న 72 గంటల్లోనే సమస్యన పరిష్కరిస్తున్నట్లు చెప్పారు. అర్హత ఉండి సంక్షేమ పథకాలు అందలేదనే మాట రాకుండా.. ప్రతి ఒక్కరికీ పథకాలు అందిస్తున్నామన్నారు. ప్రజల కోసం ఏర్పాటు చేసి ఈ గ్రామ/వార్డు సచివాలయాలను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. కార్యక్రమంలో ఎంపీపీ దమలపాటి వెంకటరమణ, సర్పంచ్ మిడతాని కళ్యాణి, జెడ్పీటీసీ జంపు కన్నతల్లి, పీఏసీఎస్ అధ్యక్షుడు కర్రి లీలప్రసాద్, తదితరులు పాల్గొన్నారు.

ఆడుదాం ఆంధ్రాకు 2,968 దరఖాస్తులు

గరుగుబిల్లి: ఆడుదాం ఆంధ్రా ఆటల పోటీలకు మండలం నుంచి 2,968 మంది క్రీడాకారులు దరఖాస్తు చేసుకున్నారని ఎంపీడీఓ జి.పైడితల్లి సోమవారం తెలిపారు. సచివాలయాల వారీగా వచ్చిన దరఖాస్తులను సోమవారం పరిశీలించారు. గరుగుబిల్లి గ్రామ సచివాలయం నుంచి 204, పెద్దూరు సచివాలయం నుంచి 141, పెదగుడబ నుంచి 174, రావివలస 249, శివ్వాం 205, గొట్టివలస 174, నాగూరు 289, సంతోషపురం 219, తోటపల్లి 405, ఉల్లిభద్ర 181, ఉద్దవోలు 396, రావుపల్లి 177, చినగుడబ సచివాలయం నుంచి 181 దరఖాస్తులు వచ్చాయన్నారు. ఈమేరకు క్రీడాకారులకు సామాగ్రి అందించడంతో పాటు క్రీడా మైదానాలను సిద్ధం చేయాలని వ్యాయామోపాధ్యాయులకు సూచించినట్లు చెప్పారు.

ఆలయాల్లో ధనుర్మాస పూజలు

పాలకొండ రూరల్: ధనుర్మాసాన్ని పురస్కరించుకుని మండలంలోని యరకారాయపురం, అంపిలి, మంగళాపురం, తుమరాడ తదితర గ్రామంలోని ఆలయాల్లో సోమవారం ప్రత్యేక పూజలు చేశారు. అర్చకులు దార్లపూడి లక్ష్మీప్రసాద్ వర్మ, జోష్యుల ఆంజనేయ వర్మ నేతృత్వంలో స్వామికి అభిషేకాలు, అర్చనలు చేశారు. పలువురు ఆధ్యాత్మిక వక్తలు తిరుప్పావై ప్రవచనాలు, ధనుర్మాస విశిష్టతను భక్తులకు వివరించారు. పలు గ్రామాల్లో భజన బృందాలు వేకువజామున నగర సంకీర్తనలు నిర్వహించారు.

యువకుల దాడిలో ముగ్గురికి గాయాలు



కురుపాం: చికిత్స పొందుతున్న కామేశ్వరరావు

జియ్యమ్మవలస: మండలంలోని రామినాయుడువలసలో ఆదివారం రాత్రి పెండ్లి వేడుకకు హాజరైన ముగ్గురు యువకులపై గుర్తు తెలియని వ్యక్తులు దాడిచేసినట్లు గ్రామస్తులు తెలిపారు. వివరాలిలా ఉన్నాయి. మండలంలోని కన్నపుదొరవలస గ్రామానికి కిశోర్, క్రాంతి, కాళిలు పెళ్లికి రాగా పార్వతీపురం మండలానికి చెందిన కొంతమంది వారిపై దాడికి పాల్పడ్డారు. గాయపడిన ముగ్గురు యువకులను చినమేరంగి సీహెచ్‌సీకి బంధువులు తరలించి ప్రాథమిక వైద్యం అనంతరం మెరుగైన వైద్యం కోసం పార్వతీపురంలోని ఏరియా హాస్పిటల్‌కు పంపించినట్లు చినమేరంగి వైద్యులు తెలిపారు. ఈ విషయంపై పోలీసులు వివరాలు సేకరిస్తున్నారు.

తేనెటీగల దాడిలో గిరిజన రైతుకు అస్వస్థత

కురుపాం: మండలంలోని కిచ్చాడ పంచాయతీ పట్టాయిదొర వలస గ్రామానికి చెందిన గిరిజన రైతు యజ్జు కామేశ్వరరావు (58) తేనెటీగల దాడిలో గాయపడి అస్వస్థతకు గుర్యాడు. సోమవారం ఉదయం పంటపొలం వద్దకు కేమేశ్వర రావు వెళ్తుండగా ఒక్కసారిగా తేనేటీగలు ముఖం, వంటిపై దాడి చేశాయి. గ్రామస్తులు వెంటనే కురుపాం సామాజిక ఆరోగ్య కేంద్రానికి తరలించగా వైద్యులు చికిత్స అందించారు. ప్రస్తుతం ఆరోగ్యం నిలకడగానే ఉందని వైద్యులు తెలిపారు.

సెల్ఫీ విత్ మెరిట్ స్టూడెంట్స్



విద్యార్థినులతో సెల్ఫీ తీసుకుంటున్న హెచ్ఎం లిల్లీరాణి

సీతంపేట: 'సెల్ఫీ విత్ మెరిట్ స్టూడెంట్స్ (ప్రతిభావంతులైన విద్యార్థులతో సెల్ఫీ) కార్యక్రమాన్ని స్థానిక గిరిజన బాలికల సంక్షేమ ఆశ్రమ పాఠశాలలో సోమవారం నిర్వహించారు. మూడో తరగతి నుంచి పదో తరగతి వరకు ఎస్ఏ-1 ఆంగ్ల మాధ్యమంలో నిర్వహించిన పరీక్షల్లో ఫస్ట్ వచ్చిన విద్యార్థినులతో హెచ్ఎం ఎ.లిల్లీరాణి సెల్ఫీ తీసుకున్నారు. అనంతరం విద్యార్థుల తల్లిదండ్రులతో సమావేశం నిర్వహించారు. విద్యార్థులు ప్రోగ్రెస్ కార్డులను అందజేశారు.

వాహన తనిఖీలు

పాలకొండ రూరల్: పాలకొండ-శ్రీకాకుళం రహదారిలో ఎస్సై ఎస్.ప్రశాంత్‌కుమార్ నేతృత్వంలో పోలీసులు సోమవారం వాహన తని ఖీలు చేపట్టారు. వాహన ధ్రువపత్రాలను పరిశీలించారు. అధికలోడు వస్తున్న వాహనాలు, మద్యం తాగి వాహనం నడుపుతున్న వారిని గుర్తించి కేసులు నమోదు చేశారు. రోడ్డు ప్రమాదాల నివారణ, నిషేధిత పదార్థాల అక్రమ రవాణాను అడ్డుకునేందుకు అవసరమైన అన్ని చర్యలు తీసుకుంటున్నట్లు చెప్పారు.

'హెల్పింగ్ హ్యాండ్స్' సాయం

గుమ్మలక్ష్మీపురం: మండల కేంద్రంలోని గడ్డికాలనీకి చెందిన గంటా లక్ష్మి దీర్ఘకాలిక వ్యాధితో బాధపడుతుండడంతో హెల్పింగ్ హ్యాండ్స్ సంస్థ సభ్యులు సోమవారం ఆమె ఇంటికి వెళ్లి పరామర్శించారు. ఆమె ఆరోగ్య పరిస్థితిని అడిగి తెలుసుకుని ధైర్యం చెప్పారు. వైద్య ఖర్చుల కోసం ఆర్థిక సాయం, పండ్లు, నిత్యావసర సామగ్రిని అందజేశారు. కార్యక్రమంలో స్థానిక సర్పంచ్ బి.గౌరీశంకరరావు, వైస్ ఎంపీపీ నిమ్మక శేఖర్, హెల్పింగ్ హ్యాండ్స్ అధ్యక్షుడు పాలక ప్రేమానంద్, వర్తక సంఘం అధ్యక్షుడు విష్ణుప్రసాద్, వైశ్య సంఘం అధ్యక్షుడు జి.హరిప్రసాద్ తదితరులున్నారు.

త్రైత సిద్ధాంత భగవద్గీత ప్రచారం



త్రైత సిద్ధాంత భగవద్గీతను ప్రచారం చేస్తున్న ప్రబోధ సమితి సభ్యులు

సీతంపేట: మండలంలోని గడిగుడ్డిలో ప్రబోధ సమితి విజ్ఞాన వేదిక ఆధ్వర్యంలో సోమవారం త్రైత సిద్ధాంత భగవద్గీత ప్రచారం నిర్వహించారు. సమితి అధ్యక్షుడు సంతోష్‌కుమార్ గీతా సారాన్ని బోధించారు. ప్రతి ఒక్కరూ సన్మార్గంలో నడవాలని, ఆధ్యాత్మిక భావాలు పెంపొందించుకోవాలని కోరారు. ధనుర్మాసం విశిష్టతను వివరించారు. కార్యక్రమంలో ప్రచారకర్తలు దుర్గారావు, పుండరీకాక్షయ్య, ఈశ్వర్‌లాల్, వెంకటరావు, గోపాలకృష్ణ, ప్రశాంతి, స్వాతి తదితరులు పాల్గొన్నారు.

ఆరోగ్యశ్రీ పరిమితి పెంపుతో మరింత లబ్ధి



గుమ్మలక్ష్మీపురం: ఎల్విన్‌పేట ఆర్బీకేలో సీఎం ప్రసంగాన్ని ప్రత్యక్ష ప్రసారంలో వీక్షిస్తున్న అధికారులు, ప్రజాప్రతినిధులు



భామిని: మండల పరిషత్‌లో సీఎం సందేశాన్ని ప్రత్యక్ష ప్రసారంలో వీక్షిస్తున్న అధికారులు, ప్రజాప్రతినిధులు

గుమ్మలక్ష్మీపురం: డాక్టర్ వైఎస్సార్ ఆరోగ్యశ్రీ కింద చికిత్సల వ్యయ పరిమితి రూ.25 లక్షలకు పెంపుతో పేద, మధ్యతరగతి ప్రజలకు కార్పొరేట్ ఆస్పత్రుల్లో మరింత మెరుగ్గా వైద్య సేవలు అందుతాయని ఎంపీడీఓ జి.జగదీష్‌కుమార్ అన్నారు. ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి సోమవారం తాడేపల్లిలోని సీఎం క్యాంపు కార్యాలయంలో ఆరోగ్యశ్రీ వ్యయ పరిమితిని రూ.25 లక్షలకు పెంచారు. ఈ సందర్భంగా ఆయన ప్రజలను ఉద్దేశించి చేసిన ప్రసంగాన్ని ఎల్విన్‌పేట ఆర్బీకేలో మండల స్థాయి అధికారులు, సచివాలయ సిబ్బంది, ప్రజాప్రతినిధులు ప్రత్యక్ష ప్రసారంలో వీక్షించారు. ఈ సందర్భంగా ఎంపీడీఓ మాట్లాడుతూ.. ముఖ్యమంత్రి ఆదేశాల మేరకు ఆరోగ్యశ్రీ ద్వారా అందిస్తున్న చికిత్సలపై ప్రలజకు విస్తృత అవగాహన కల్పించాలని అధికారులు, సిబ్బందికి సూచించారు.

భామిని: ఆరోగ్యశ్రీ పథకంపై విస్తృతంగా ప్రచారం చేయాలని, ఈ పథకం కింద అందిస్తున్న వైద్య సేవలపై ప్రజలకు అవగాహన కల్పించాలని వైస్ ఎంపీపీ బోనగడ్డి ధర్మారావు, జేసీఎస్ కోఆర్డినేటర్ కొత్తకోట చంద్రశేఖర్ పిలుపునిచ్చారు. ఆరోగ్యశ్రీ వ్యయ పరిమితిని రూ.25 లక్షలకు పెంపు సందర్భంగా సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి చేసిన ప్రసంగాన్ని స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో ఎంపీడీఓ జె.ఉమామహేశ్వరితో కలిసి ప్రత్యక్ష ప్రసారం ద్వారా వీక్షించారు. కార్యక్రమంలో భామిని ఎంపీటీసీ బిడ్డిక తులసి, సర్పంచ్‌లు జామి ప్రభాకర్, అగతముడి రఘు, వైద్యాధికారులు డాక్టర్ సంతోషి లక్ష్మి, డాక్టర్ కె.ప్రతాప్, సీహెచ్ఓ భాస్కరరావు, వైద్య సిబ్బంది ఉన్నారు. మండల స్థాయిలో అన్ని సచివాలయాల్లోనూ సీఎం లైవ్ ప్రోగ్రాం వీక్షించారు.

ఆర్డీఓ కార్యాలయం ముట్టడి

పాలకొండ: ఆర్డీఓ కార్యాలయం వద్ద అంగన్‌వాడీ కార్యకర్తలు సోమవారం ఆందోళన చేపట్టారు. ముందుగా ఆర్టీసీ కాంప్లెక్స్ నుంచి ఆర్డీఓ కార్యాలయం వరకు ర్యాలీ చేశారు. ఆర్డీఓ కార్యాలయం వద్ద రోడ్డుపై బైఠాయించి తమ డిమాండ్లు తీర్చాలని నినాదాలు చేశారు. అనంతరం ఆర్డీఓ లావణ్యకు వినతిపత్రం అందించారు. వారికి సీఐటీయూ నాయకులు మద్దతిచ్చారు.